క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఏఓను సన్మానిస్తున్న ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు

తరిగొప్పుల: మండల వ్యవసాయ అధికారిగా పెచెట్టి మనోహిత్ విక్రమరావ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కమల, జీడిగం భిక్షపతి,మాశెట్టి వేణుగోపాల్,తుమ్మలపల్లి శివకుమార్, జీడిగం కనుకయ్య, బట్టు చంద్ర శేఖర్, గూడెల్లి రంజిత్‌రెడ్డి, గునిగంటి వెంకటేష్, అమిరిశెట్టి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా జ్యోతి



దేవరుప్పుల: ఇటీవల ప్రభుత్వం నూతన ఉద్యోగ నియమకాలు చేపట్టిన క్రమంలో ఎంపికైన సూర్యాపేట జిల్లా తిర్మలగిరికి చెందిన బజ్జూరి జ్యోతి మండల వ్యవసాయ అధికారిగా శుక్రవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో రైతు సంక్షేమ కోసం శాఖపరంగా అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ తోడ్పాటు అందిస్తామన్నారు. అనంతరం దేవరుప్పుల రైతు వేదికను సందర్శించి స్థానిక ఏఈఓ సాగర్‌తో ప్రస్తుత మండలంలో నెలకొన్న పంటల సాగు స్థితిగతులపై సమీక్షించారు.

సంతాపం

దేవరుప్పుల: మండలంలోని కోలుకొండకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోనగిరి యాకస్వామి పితృవియోగం(చంద్రయ్య) పొందడంతో బీఆర్‌ఎస్ మండల ప్రతినిధులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో మండల పార్టీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, పల్ల సుందర్‌రామిరెడ్డి, కొల్లూరి సోమన్న, కోతి ప్రవీణ్ తదితరులు ఉన్నారు. అలాగే కడవెండిలో అకాల మృతి చెందిన గొడిశాల లక్ష్మి మృతదేహానికి పీఏసీఎస్ వైస్ చైర్మన్ నక్క రమేశ్, బీఆర్‌ఎస్ మండల నాయకులు తాటిపెల్లి మహేష్, దుబ్బాక రత్నాకర్‌రెడ్డి, పెద్ది రవి పూలమాల వేసి నివాళులర్పించారు.

యువజన కాంగ్రెస్ నాయకుడి అభిమానం



దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన లొడంగి అశోక్ ఇటీవల ప్రమాదానికి గురైన కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి కోలుకోవాలని ఏడుకొండలను కాలినడక ఎక్కి తెచ్చిన తిరుపతి ప్రసాదాన్ని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డికి శుక్రవారం హైదరాబాద్‌లో అందజేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు అభిమాన ఆశీస్సులతో తమ కుటుంబానికి ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ ప్రజాసేవ విషయంలో నిరంతరం నిమగ్నమవుతామన్నారు.ఈయన వెంట కాంగ్రెస్ యువజన మండల నాయకుడు పులిగిళ్ల వెంకన్న తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ



జఫర్‌గఢ్: వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన మండలంలోని అల్వార్‌బండాతండా శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని అల్వార్‌బండాతండాకు చెందిన బాధిత రైతులు బాదవత్ దేవేందర్, బాదావత్ బూలి, బాదావత్ అంబాలి శుక్రవారం మాట్లాడుతూ ఆర్‌సీతండా ఫీడర్ పరిధిలోని వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. దీంతో వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ సరఫరా నిలిపోవడంతో పాటు పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత ఏఈ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి తమను ఆదుకోవాలని వారు కోరారు.

నేడు పత్తి సాగుపై అవగాహన

జఫర్‌గఢ్: మండలంలోని రఘునాథ్‌పల్లి గ్రామంలో అధిక సాంద్రత పత్తి సాగుపై రైతు చేనులో నేడు (శనివారం) నిర్వహించనున్న అవగాహనకు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి.అనిల్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో కోరారు. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం యాదాద్రి భువనగిరి జిల్లా వారి ఆధ్వర్యంలో బొమ్మినేని పాపిరెడ్డి పత్తి చేనులో ఈ అవగాహన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- గానుగుపహాడ్ తాత్కాలిక వంతెనపై కొట్టుకుపోయిన మట్టి
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయాలని కోరుతున్న ప్రయాణికులు



ప్రమాదకరంగా తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు



వర్షానికి కొట్టుకుపోయిన మట్టి

జనగామ: జనగామ–నర్మెట ప్రధాన రహదారి గానుగుపహాడ్ వాగుపై నిర్మించిన తాత్కాలిక మట్టి వంతెనకు మరోసారి ప్రమాదం పొంచి ఉంది. వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యం జరగడంతో గత ఏడాది కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో తాత్కాలికంగా మట్టిరోడ్డుతో వంతెన ఏర్పాటు చేశారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగగా... హడావుడి చేసిన అధికారులు మరోసారి పైపులతో కూడిన మట్టి వంతెన నిర్మాణం చేసి చేతులు దులుపుకున్నారు. ఐదురోజుల క్రితం రాత్రి కురిసిన వర్షంతో వంతెనపై ఏర్పాటు చేసిన మట్టి కొట్టుకుపోతుండడంతో పెను ప్రమాదం పొంచి ఉంది. ప్రతి రోజు నర్మెట, తరిగొప్పుల, హుస్నాబాద్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులతో పాటు ట్రాన్స్ పోర్టు వాహనాలు, ఆయా గ్రామాలకు వెళ్లే వారు ఈ రూట్ నుంచే ప్రయాణం సాగిస్తుంటారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, ఇతర కార్మికులు ఉదయం జనగామ జిల్లా కేంద్రానికి వచ్చి రాత్రి 9 గంటల సమయంలో తిరిగి వెళ్తారు. ఈ సమయంలో భారీ వర్షం కురిసి వంతెన కొట్టుకుపోతే పెను ప్రమాదం తప్పదు. దీంతో ఈ రహదారిపై ప్రయాణం చేసే వారు ఆందోళనకు గురవుతున్నారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం చేసే బ్రిడ్జి పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రజల ప్రాణాలంటే లెక్కలేదు..



గానుగుపహాడ్ వాగుపై బ్రిడ్జి నిర్మాణం ఏళ్లు గడిచిపోతున్నా పనులు పూర్తి కావడం లేదు. జనగామ నుంచి నర్మెట, హుస్నాబాద్, అనేక గ్రామాలకు ప్రధాన రహదారిపై వర్షం కురిసిన సమయంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నా పట్టించుకోవడం లేదు. వాగులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టిరోడ్డు రెండు రోజుల క్రితం రాత్రి కురిసిన వర్షంతో కుంగిపోతుంది. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది.

– కొర్ర శంకర్, కొర్రతండా, జనగామ

అగ్నిప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్ఓ దేవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్టేషన్ ఘన్‌పూర్ ఫైర్‌స్టేషన్ అధికారి ఎస్.దేవేందర్ అన్నారు. మండలంలోని శివునిపల్లిలోని శ్రీశివ సాయి కాటన్ ఇండస్ట్రీస్‌లో స్థానిక ఫైర్‌స్టేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి కొనుగోళ్లు ప్రారంభవవుతున్న నేపథ్యంలో ఆయా మిల్లుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తగిన ఏర్పాట్లు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మిల్లుల్లో తనిఖీలు చేస్తున్నామని, నిబంధనల మేరకు అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ సిబ్బంది గణేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పగలే వెన్నెల



గుమ్మడవెల్లి బస్టాండ్ వద్ద పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు

లింగాలఘణపురం: మండలంలోని గుమ్మడవెల్లిలో వీధిలైట్లు పట్టపగలే ఊరంతా వెలుగుతున్నాయి. వీధిలైట్ల నిర్వహణ జీపీల నుంచి రెడ్‌కో సంస్థ చేపట్టడంతో గ్రామ పంచాయతీలు పట్టించుకోవడం లేదు. ఇటీవల బతుకమ్మ, దసరా ఉత్సవాల సందర్భంగా గ్రామ పంచాయితీ నుంచి వీధిలైట్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రాత్రనకపగలనక వీధిలైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఆన్ ఆఫ్ లేకపోవడంతో అటు రెడ్‌కో గాని ఇటు పంచాయతీ అధికారులు కాని పట్టించుకోవడంలేదు. ఈ విషయంపై పంచాయితీ కార్యదర్శి శ్వేతను వివరణ కోరగా రెడ్‌కో సంస్థ స్ట్రైక్‌లో ఉండి పట్టించుకోవడంలేదని, పండుగ కావడంతో తామే వేయించామని, వైరింగ్‌లో ఉన్న తేడాతో వీధిలైట్లు వెలుగుతూనే ఉన్నాయని, ట్రాన్స్‌కో అధికారులకు కూడా సమస్యను వివరించామని చెప్పారు. ఏదిఏమైన రాత్రనకపగలనక వెలుగుతున్న వీధిలైట్లతో కరెంట్ చార్జీల భారం మాత్రం తప్పడంలేదు.

స్వీయరక్షణతో సీజనల్ వ్యాధుల నివారణ



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దేవరుప్పుల: స్వీయరక్షణతో ఇంటింటా సీజనల్ వ్యాధులను తమ దరికి చేరకుండా ముందస్తు జాగ్రత్తలతో నివారించవచ్చని మండల వైద్యాధికారి పూజ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఏఎన్ఎం వసంత ఆధ్వర్యంలో ఆశవర్కర్లు దోమల వ్యాప్తి చెందే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణ చర్యలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజ మాట్లాడుతూ ప్రస్తుతం విషజర్వాల వ్యాప్తి చెందుతున్న క్రమంలో తగ్గాక కూడా దగ్గు, ఒళ్లు నొప్పుల వంటి వెంటాడుతున్నాయన్నారు. రోగాల బారిన పడి విస్తృతమై మందులు వాడి రోగనిరోధక శక్తి తగ్గించుకునే పరిస్థితులకు చెక్ పెట్టాలన్నా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తమ ఇంటి పరిసరాల్లో అనవసరైన నీటి నిల్వలు లేకుండా చేసి దోమల నివారణకు దోహదపడాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

సన్మానం



జనగామ: జనగామ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన అమ్జద్ అలీని మైనారిటీ రియల్ ఎస్టేట్ ప్రతినిధులు తదితరులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు. కౌన్సిలర్ ఎండీ సమ్మద్, ఎండీ నూరుద్దీన్, జిల్లా రియల్ ఎస్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్దుల్ ఖాదర్, ఇక్బాల్, అఖిల్, పాషా ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు..



రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు రాంబా బునాయక్, రేణిగుకుంట ప్రవీణ్, జిల్లా శంకర్, కొంగటి లక్ష్మీనారాయణను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్.. శివరాజ్‌ను సత్కరించి అభినందించారు. జనగామ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి నరసింహులు, రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ మిద్దెపాక సిద్దులు, మార్కెట్ డైరెక్టర్లు నీల మోహన్, బన్సీ నాయక్, కొండల్‌రెడ్డి, తోటకూరి రమేష్, గాదె రమేష్, మోటే శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జిల్లా సంక్షేమ అధికారికి..

చిల్పూరు: స్టేషన్‌ఘన్‌పూర్ ఐసీడీఎస్ సీడీపీఓగా విధులు నిర్వహించి జిల్లా సంక్షేమ అధికారిగా బాధ్యతలు చేపట్టిన డోర్నాల ఫ్లోరెన్స్‌ను శుక్రవారం మండల అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా సన్మానించారు. మంద రేణుక, గుర్రం నీన, సట్ల కవిత, కర్ణకంటి వాణిస్వర్ణవీణ, ఉమారాణి ఉన్నారు.

జయప్రదం చేయాలి

చిల్పూరు: ఎస్సీల్లో 57 ఉపకులాలు ఉన్నాయని, అందరికి న్యాయం జరగాలని ఈనెల 21 హైదరాబాద్‌లో డక్కలి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టే నిరసన దీక్షను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నె రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని నష్కల్ గ్రామంలో శుక్రవారం సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్ణకంటి వెంకటేష్‌తో కలిసి రామారావు దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మాజీ సర్పంచ్ కర్ణకంటి స్వప్న, లింగరాజు, బాణాల మొగిళి, రాజయ్య, వెంకన్న, రవి, రాములమ్మ పాల్గొన్నారు.

ఎల్‌టీ లైన్ ఏర్పాటు చేయండి

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలోని 9వ వార్డులో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని వెంటనే ఎల్‌టీ లైన్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఏఈ విశ్వసాయికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎండీ షభానా, నక్క యాకయ్య, వేల్పుల పెద్ద రాములు, రాపర్తి రజిత, ఎండి శంషోద్దీన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

టిప్పర్ సీజ్

దేవరుప్పుల: మండలంలోని మున్‌పహాడ్ ఏరియాలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. సహజ వనరుల తరలింపు విషయంలో సంబంధిత శాఖపరమైన అనుమతులు తీసుకున్నాకే అభివృద్ధి పనులు చేపట్టాలని, ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి, ఇసుక వంటి తరలింపునకు ఎవరు పాల్పడినా చట్టపరంగా కేసులు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

వేలం వాయిదా

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజాసామగ్రి (అభిషేకం, వాహన పూజ సామాగ్రి మినహాయించి) తల నీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే లైసెన్స్ కోసం శుక్రవారం నల్గొండలోని సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ కార్యాలయంలో సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. సరైన పాట రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఈఓ సల్వాది మోహన్‌బాబు తెలిపారు. తిరిగి ఈనెల 25న శుక్రవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఆర్‌జేసీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌ను పంచాయతీ కార్యదర్శి తండ రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది నెలలుగా మూత పడిన మినరల్ వాటర్ ప్లాంట్ ఇక నుంచి పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు మినరల్ వాటర్‌ను వినియోగించుకోవాలని కోరారు.

పరామర్శ

జఫర్‌గఢ్: మండలంలోని వడ్డెగూడెంలో ఇల్లందుల ఐలయ్య మృతి చెందింది. కాగా, గ్రామానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఇదే గ్రామంలో మృతి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ కుటుంబంతోపాటు ఉప్పుగల్లులో పలు కుటుంబాలను శ్రీహరి పరామర్శించారు.

కొమ్మూరిని కలిసిన నాయకులు



బచ్చన్నపేట: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని హైదరాబాద్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కట్కూరు–బండనాగారం వరకు బీటీ రోడ్డు మంజూరుకు నిధులు మంజూరు చేయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను సన్మానించారు. అలాగే బొనకొల్లూరుకు బీటీ రోడ్డు మంజూరు చేయించాలని వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, నల్లనాగుల వెంకన్న, కొల్ల నర్సిరెడ్డి, చల్ల సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి



మాట్లాడుతున్న ఈఈ శ్రీకాంత్

కొడకండ్ల: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని మిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో వాటర్‌మెన్‌లకు నిర్వహిస్తున్న నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించేందు కోసం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో తెలిపే మెళకువలను పాటిస్తూ స్వచ్ఛమైన నీరందించాలని, పైపులైన్‌ల మరమ్మతు, నీటి కొరత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లావణ్య

స్టేషన్‌ఘన్‌పూర్: పత్తి రైతులు తాము పండించిన పంటను సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని శివునిపల్లిలోని శ్రీశివసాయి కాటన్ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యదర్శి జన్ను భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పత్తికి సీసీఐ నిబంధనల మేరకు క్వింటాల్‌కు రూ.7,521 ధర నిర్ణయించారని, రైతులు పండించిన పంటను 8 శాతం తేమ మించకుండా సరైన నాణ్యతా ప్రమాణాలతో తీసుకురావాలని సూచించారు. పత్తి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, సీసీఐ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, ఇండస్ట్రీస్ ప్రొపైటర్ మనోహర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, పార్టీ జిల్లా నాయకుడు కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు, రైతులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌కి చెందిన నలుగురు విద్యార్థినులు బి.ఇందు (9వ తరగతి), జి.ప్రసన్న, బానోత్ హర్షవర్ధన్ (8వ), జి.అంకిత (7వ తరగతి) రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కుసుమ రమేష్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. ఈనెల 17న జనగామలోని క్రిస్టన్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్‌పోటీలలో పాల్గొన్న నలురుగు విద్యార్థినులు ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 19, 20వ తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను పాఠశాల హెచ్ఎం రమేష్, పీడీ కొండ రవి, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ భగత్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జనగామ రూరల్: ఎస్సీ, ఎస్టీ కేసులను తక్షణమే పరిష్కరించాలి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు కలెక్టరేట్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులను తక్షణమే పరిష్కరించాలని, దళితుల భూములు ఆక్రమణకు, అన్యాక్రాంతానికి గురికాకుండా చూడాలని, ఇచ్చే నష్ట పరిహారం వెంటనే బాధితులకు అందేలా చూడాలని కోరారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్ మాదిగ ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి చెందిన రవీందర్, నాయకులు నిర్మల భాస్కర్, గువ్వల రవి, ఎమ్మార్పీఎస్ నాయకుడు తుర్కపల్లి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ ప్రిన్సిపాల్‌ను నిలదీసిన పేరెంట్

జనగామ రూరల్: మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఓ పేరెంట్ నిలదీశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెంబర్తి గురుకుల బాలుర పాఠశాలలో ఓ విద్యార్థిపై అదే పాఠశాలలోని పై తరగతి విద్యార్థులు గత నెలలో పసుపు కుంకుమలతో వింత ప్రవర్తన చేస్తున్నాడని ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై తల్లిదండ్రులను పిలిచి మాట్లాడారు. కాగా, సెలవులు రావడంతో ఇంటికి వెళ్లిన విద్యార్థి పాఠశాలకు రావాలని హౌస్ మాస్టర్ ఫోన్ చేయగా గురువారం పేరెంట్ తండ్రి పాఠశాలకు వచ్చి తన కుమారుడికి చేతబడి వస్తుందా అని అడగడం ఏంటని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. బాధ్యతాయుతంగా ఉండాల్సిన ప్రిన్సిపాల్ టీసీ ఇస్తా అని అనడం సరికాదని అన్నారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ చంద్రమౌళిని వివరణ కోరగా విద్యార్థి హాస్టల్‌లో వింత ప్రవర్తన చేస్తూ తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆస్పత్రిలోలో చూపించి, ఇంటి వద్ద చూసుకోవాలని తెలిపినట్లు చెప్పారు. టీసీ ఇవ్వలేదని తండ్రిని పిలిపించి మాట్లాడటం జరిగిందన్నారు. కాగా, ఈ ఘటనపై ఇప్పటికీ ఉన్నత అధికారులకు, కలెక్టర్‌కు తెలపకపోవడం గమనార్హం.

యథేచ్ఛగా కలప రవాణా



రవాణాకు సిద్ధంగా ఉన్న కలప

తరిగొప్పుల: ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని చేపడుతుంటే మరోవైపు మండలంలోని అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరుకుతూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదం అధికారుల అలసత్వంతో కాగితాలకే పరితమైంది. అటవిని రక్షించడంతో పాటు వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వాల్టా చట్టం రూపొందించింది. చెట్లను నరికి వేయాలంటే అటవీశాఖ, రెవెన్యూ శాఖ, సంబంధిత గ్రామపంచాయతీ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో మండల పరిధిలో అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లోని చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. వనసంపద సంరక్షణ కోసం తీసుకువచ్చిన వాల్టా చట్టం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతుంది. కలప అక్రమ రవాణా విషయం తెలిసినా అటవీ శాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆధునిక యంత్రాలను వినియోగించి గుట్టుచప్పుడు కాకుండా చెట్లను నరికి వేస్తూ వాహనాల్లో తరలించి సొమ్ముచేసుకుంటున్నారు.

గుట్కాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కాలతో పోలీసులు

కొడకండ్ల: మండలకేంద్రంలోని పూర్ణచందర్ కిరాణం షాపులో శుక్రవారం తనిఖీలు నిర్వహించి నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకుని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ బాబులాల్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ టీం తనిఖీలు నిర్వహించగా రూ.4,470 విలువ చేసే నిషేధిత గుట్కాలు పట్టుకుని విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు.

నిరంతర విద్యుత్ సరఫరాయే ధ్యేయం



జఫర్‌గఢ్: నిరంతరం విద్యుత్‌ను అందించడమే తమ ధ్యేయమని స్టేషన్‌ఘన్‌పూర్ విద్యుత్ డీఈ వై.రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయాన్ని డీఈ రాంబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యుత్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఈ విశ్వసాయితి, ఫోర్మెన్ జావీద్, లైన్ ఇన్స్‌పెక్టర్ కాల్‌రామ్, అనంద్, లక్ష్మారెడ్డి, లైన్‌మెన్లు కుమారస్వామి, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.